

163 మందికి కొవిడ్ పాజిటివ్

బెంగళూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొవిడ్ కేసులు నిలకడగా సాగుతున్నాయి. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా 163 మందికి పాజిటివ్ నిర్ధారణ కాగా 162 మంది డిశ్చార్జి అయ్యారు. బెంగళూరులో 50 మంది, మైసూరు లో 27, హాసన్‌లో 10 మందికి ప్రబలగా మిగిలిన జిల్లాలో పదిలోపు కేసులు నమోదయ్యాయి. 994 మంది చికిత్సలు పొందుతున్నారు. కాగా, కొవిడ్ మృతు ల అంత్యక్రియలు జరిపేలా వైద్యఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని నగర పాలక, పురపాలక, మహానగర పాలికెలతో పాటు గ్రామ పంచాయతీల పరిధి లోని స్మశాన వాటికలలో అమలు చేసేలా శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.



వివేకానంద చిత్రపటానికి పుష్పాంజలి

ఉద్యోగ కల్పనే లక్ష్యం



చెక్కులు అందచేస్తున్న సీఎం సిద్ధరామయ్య, చిత్రంలో మంత్రులు తదితరులు

● అర్హులందరికి 'యువనిధి' వర్తింపు ● గ్యారెంటీలన్నీ అమలు చేస్తున్నాం ● ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ● యువనిధి ప్రారంభం

బెంగళూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): యువనిధితో ఇచ్చే ప్రోత్సాహంకంటే ఉద్యోగాలు కల్పించడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఐదో గ్యారెంటీ 'యువనిధి'ని శుక్రవారం శివమొగ్గలో లాంఛనంగా ప్రారంభించారు. ఫ్రీడం పార్కు మైదానంలో జరిగిన సభలో నిరుద్యోగ యువతకు చెక్కుల పంపిణీ చేశారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు నాగేంద్ర, శరణు ప్రకాశ్‌పాటిల్, ఎంసీ సుధాకర్‌తోపాటు స్థానిక ఎంపీ రాఘవేంద్ర సహా అధికారులు భాగస్వామ్యులయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఇది చారిత్రాత్మక దినమని కొనియాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయలేరని రాష్ట్ర నాయకుల నుంచి ప్రధానమంత్రి దాకా విమర్శలు చేశారని, అయినా సాధ్యం చేశామని సీఎం ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ప్రకటించిన ఐదు గ్యారెంటీలను అమలు చేశామన్నారు. సమాజంలో పేదలు, అట్టడుగు వర్గాలకు ఆర్థికశక్తి పెంపొందింపచేయాలనే గ్యారెంటీలను తీసుకొచ్చామని తెలిపారు. ఇచ్చిన హామీని అమలు చేయడమే తమ ప్రభుత్వ ఆశయమన్నారు. డిప్లొమో, డిగ్రీ పూర్తి చేసి ఆరు నెలల్లోగా ఉద్యోగం లభించకపోతే యువనిధి పథకం ద్వారా ప్రోత్సాహకం అందిస్తామన్నారు. స్వామి వివేకానంద జయంతి రోజునే యువనిధిని ప్రారంభించామని గుర్తు చేశారు. 70వేల మంది యువత గ్యారెంటీకి నమోదు చేసుకున్నారన్నారు. 3.96 లక్షల మంది డిగ్రీ పట్టభద్రులు, 18వేలమంది డిప్లొమో పూర్తి చేసిన వారు ఉన్నారని, వారిలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ యువనిధి వర్తిస్తుందన్నారు. సమాజంలో నిరుద్యోగ సమస్య పెరిగిందని, ఇక భవిష్యత్తు లేదని భావించే యువతకు యువనిధి గ్యారెంటీతో కొంత ఉపశమనం కలిగిస్తున్నామని పేర్కొన్నారు. యువనిధితో ఇచ్చే ప్రోత్సాహంకంటే ఉద్యోగాలు కల్పించడమే ముఖ్యంగా భావిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఐదారువేలు ఆర్థిక వెసులుబాటు కల్పించామని, ఇది యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్‌గా పిలుస్తారన్నారు. సమాజంలో ఆర్థికశక్తి అందరికీ కల్పించాలన్నదే తమ ఆశయమన్నారు. గృహజ్యోతితో 1.65 కోట్ల కుటుంబాలు ఉచిత విద్యుత్ పొందుతున్నాయని తెలిపారు. అన్నభాగ్య ద్వారా 10 కిలోల బియ్యం సాధ్యం కానందున 5 కిలోలకు నగదు బదిలీ చేస్తున్నామని వివరించారు. 1.18 కోట్ల మంది మహిళలకు గృహలక్ష్మి వర్తిస్తోందన్నారు. 12.8 కోట్ల మంది శక్తి గ్యారెంటీ ద్వారా ఉచితంగా ప్రయాణాలు సాగించారని తెలిపారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ యువతకు ఆర్థికంగా, సామాజికంగా శక్తి కల్పించాలనే యువనిధిని ప్రారంభించామని తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ నెరవేర్చామన్నారు. ఈ గ్యారెంటీలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని పేర్కొన్నారు. దేవుడు వరం, శాపం రెండూ ఇవ్వడని అవకాశాలు మాత్రమే ఇస్తాడని, వాటిని సద్వినియోగం చేసుకోవడమే ముఖ్యమని యువతకు హితవు పలికారు. ఎంపీ రాఘవేంద్ర మాట్లాడుతూ సీఎం నేతృత్వంలో నిరుద్యోగ యువతకు ఆర్థిక చైతన్యం స్వాగతిస్తున్నామని, వలతోపాటు చేపలు ఎలా పట్టాలో కూడా నేర్పాలని, యువతకు నైపుణ్యత ముఖ్యమని పేర్కొన్నారు.




బహిరంగసభలో పాల్గొన్న ప్రజలు

పబ్ పార్టీ కేసులో విచారణకు హాజరైన దర్శన్, అభిషేక్

బెంగళూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గడువుకు మించి పబ్‌లో పార్టీ చేసుకున్నారని కేసు నమోదైన మేరకు హీరోలు దర్శన్, అభిషేక్ అంబరీశ్ సహా 8 మంది సుబ్రహ్మణ్యనగర్ పోలీస్ స్టేషన్‌కు హాజరయ్యారు. శుక్రవారం సాయంత్రం నిర్మాత రాక్‌లైన్ వెంకటేశ్, నటులు డాలీ ధనంజయ్, నీనాసం సతీశ్, చిక్కణ్ణ, సంగీతదర్శకుడు హరికృష్ణ, దర్శకుడు తరుణ్ సుధీర్ కూడా పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఈనెల 3న ఓరియన్‌మాల్‌కు అనుబంధంగా ఉండే జెట్‌లాగ్ పబ్‌లో కాటేరా సినిమా విజయవంతమైన నేపథ్యంలో వారు పార్టీ చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు నోటీసులు జారీ చేయగా ఒకేసారి విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మాత రాక్‌లైన్ వెంకటేశ్ మాట్లాడుతూ కాటేరా సినిమా విజయవంతం కావడంతో దర్శన్ ఎదుగుదలను ఓర్వలేక ఎవరు కుట్ర పన్నారో తెలుసని అన్నారు. పోలీసులు నోటీసులు జారీ చేశారని, చట్టాన్ని గౌరవించాలనే విచారణకు వచ్చామని తెలిపారు. రాత్రి పొద్దుపోయాక హోటల్, పబ్‌లలో భోజనం చేసే అందరికీ నోటీసులు ఇస్తారా..? అని ప్రశ్నించారు.

ఈ నెల 18 నుంచి కర్ణాటక భారత్ గౌరవ్ దక్షిణ యాత్ర

బెంగళూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖ సహకారంతో కర్ణాటక భారత్ గౌరవ్ దక్షిణ యాత్ర ఈ నెల 18న ప్రారంభం కానుంది. ఈ ప్రత్యేక రైలు జనవరి 18న బెంగళూరు నుంచి బయల్దేరి వెళుతుంది. రామేశ్వరం, కన్యాకుమారి, మధురై, తిరువనంతపురం పుణ్యక్షేత్రాల సందర్శన అనంతరం జనవరి 23న నగరానికి తిరిగి వస్తుంది. జనవరి 30న బెంగళూరు నుంచి మరో రైలు ఉంటుందని ఈ రైలు ఫిబ్రవరి 4న తిరిగి వస్తుందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐఆర్‌సీటీసీ ద్వారా టికెట్లను రిజర్వుచేసుకోవచ్చునని, ఈ యాత్రకోసం ఒక్కొక్కరికి రూ. 15వేలు ఖర్చు కానుండగా ఇందులో రూ. 5వేలు రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీగా ఇస్తుందని ప్రయాణికులు రూ. 10వేలు భరించాల్సి ఉంటుందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బెంగళూరులోని యశ్వంతపురం నుంచి ఈ ప్రత్యేక రైలు రాకపోకలను సాగిస్తుందని తెలిపారు.



గందరగోళంలో కాంగ్రెస్ అనుచిత వ్యాఖ్యలు

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

రాయచూరు, జనవరి 12 : ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూస్తున్న కాంగ్రెస్ అగ్రనాయకత్వం గందరగోళంలో అనుచిత వ్యాఖ్యలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర పేర్కొన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర నాయకులు మొదలుకొని కేంద్ర నాయకత్వం వరకు అన్ని విషయాల్లోను పరస్పర విరుద్ధమైన ఆరోపణలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. జిల్లాలోని దేవదుర్గ తాలూకా తింథిణి కనక గురుపీఠం వారు నిర్వహిస్తున్న హాలుమత సంస్కృతి వైభవ కార్యక్రమంలో పాల్గొనేందుకు శుక్రవారం జిల్లాకు వచ్చిన విజయేంద్ర విలేకరులతో మాట్లాడారు. రామమందిర ప్రారంభోత్సవానికి సంబంధించి ఆహ్వానం అందలేదని ఒకరు, నిర్మాణం పూర్తికాలేదని మరొకరు, రాజకీయ దురుద్దేశంతోనే ప్రారంభిస్తున్నారంటు ఇంకొందరు ఆరోపణలు చేస్తూ పరస్పర, విరుద్ధమైన మాటలతో తమకుతామే గందరగోళంలో ఉన్నారని తెలిపారు. కేవలం మైనార్టీల ఓట్ల కోసమే రామమందిర ప్రారంభోత్సవాన్ని వ్యతిరేకిస్తూ కార్యక్రమానికి హాజరు కాకూడదని కాంగ్రెస్ నాయకుల ఆలోచనగా ఉందని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక సతమతమవుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల నుంచి వ్యతిరేకత మొదలైందని విజయేంద్ర స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ పార్టీకి లోకసభ ఎన్నికల భయం పట్టుకుందన్నారు. కాగా రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులను మార్చుతున్నట్లు వస్తున్న వార్తల గురించి విజయేంద్ర వ్యాఖ్యానించేందుకు నిరాకరించారు. ఇది కేంద్ర నాయకత్వానికి సంబంధించిన విషయమని తెలిపారు. అదే సమయంలో యువతకు మరిన్ని అవకాశాలను కల్పించడం ద్వారా లోక్‌సభ ఎన్నికలను మరింత సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నది పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకుల లక్ష్యమన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటున్న బీజేపీని ప్రజలు మూడో సారి ఆదరించేందుకు సిద్ధంగా ఉన్నారని, మోదీ నాయకత్వంలో పార్టీ హ్యాట్రిక్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



హాలుమత సంస్కృతి వైభవ కార్యక్రమంలో సన్మానం అందుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

కాంగ్రెస్ పార్టీ హిందూ వ్యతిరేకి

● కేంద్ర మంత్రి ప్రహ్లాదజోషి

రాయచూరు, జనవరి 12 : కాంగ్రెస్ పార్టీ ఆది నుంచి హిందు వ్యతిరేక వైఖరినే అవలంబిస్తోందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద జోషి ఆరోపించారు. ఆ పార్టీ వైఖరి స్వాతంత్ర్య అనంతరం మొదలై ఇప్పటి వరకు అదే రీతిలో కొనసాగుతున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం జిల్లాలోని దేవదుర్గ తాలూకా తింథిణి కనకగురుపీఠంలో జరిగిన హాలుమత సంస్కృతి వైభవ కార్యక్రమంలో పాల్గొని సన్మానం అందుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాతూ కాంగ్రెస్ పార్టీపై పలు ఆరోపణలు చేశారు. సోమనాథ ఆలయ ప్రారంభోత్సవానికి వెళ్లేందుకు ప్రయత్నించిన దేశ తొలి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్‌నే కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందని ఆరోపించారు. దేవాలయం ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ఎలా వెళుతారంటూ ప్రశ్నించడం ద్వారా అప్పట్లోనే కాంగ్రెస్ పార్టీ తన హిందూ వ్యతిరేక వైఖరిని బయటపెట్టుకుందన్నారు. ప్రస్తుతం రామ మందిర ప్రారంభాన్ని సైతం రాజకీయ కోణంలోనే చూస్తూ వ్యతిరేక ప్రచారం చేస్తుండడాన్ని ప్రజలు గమనించాలన్నారు. రాముడు దేవుడనడం ఒక కట్టుకథ అంటూ కరసేవకులపై దాడులు చేయడమేగాక కాల్పులకు తెగబడిన చరిత్ర కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలదని ఆరోపించారు.



సన్మానం అందుకుంటున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద జోషి

20 ఏళ్లుగా రామకోటి రాస్తున్నా

● రాముడి పరమభక్తుడిని ● మంత్రి కేహెచ్ మునియప్ప

బెంగళూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామలల్లా విగ్రహావిష్కరణ విషయమై తీవ్రమైన చర్చలు సాగుతున్న తరుణంలోనే రాష్ట్ర పౌర ఆహార సరఫరాల శాఖ మంత్రి కేహెచ్ మునియప్ప తన రామభక్తిని వివరించారు. శుక్రవారం బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను రాముడి పరమభక్తుడనని తెలిపారు. గడిచిన 20 ఏళ్లగా ప్రతినిత్యం రామకోటి రాస్తున్నానని వెల్లడించారు. బాల్యం నుంచి రాముడిని ఆరాధిస్తున్నానని పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండుపూటలా 108 సార్లు చొప్పున శ్రీరామ అంటూ రాస్తానని తెలిపారు. వీలుంటే 1080సార్లు రాస్తానని చెప్పారు. అయోధ్యలో రామలల్లా విగ్రహ ప్రతిష్ఠను ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజకీయం చేస్తున్నారని, అందుకే దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు వెళ్లకూడదని నిర్ణయించారని తెలిపారు. ఆధ్యాత్మిక శాస్త్రాలకు అనుగుణంగా కార్యక్రమాలు జరగడం లేదన్నారు. దేవాలయ నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాలేదని పేర్కొన్నారు. ఆలయ ప్రారంభాన్ని బీజేపీ రాజకీయాల కోసం వాడుకుంటోందని ఆరోపించారు.



చిక్కబళ్లాపురం నుంచి రక్షారామయ్య..?

బెంగళూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఆర్ రక్షా రామయ్య చిక్కబళ్లాపురం లోక్‌సభ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగే అవకాశాలు అధికంగా ఉన్నాయని పార్టీ వర్గాలను ద్వారా తెలిసింది. రాజధాని బెంగళూరులో గత రెండు మూడు రోజులుగా జరిగిన అభ్యర్థుల ఎంపిక కసరత్తు అనంతరం ఈ నియోజకవర్గం నుంచి కేపీసీసీ తరపున రెండు పేర్లను ప్రతిపాదించినట్లు సమాచారం. అందులో ప్రస్తుత విధానపరిషత్ సభ్యుడు ఎంఆర్ సీతారాం తనయుడైన రక్షారామయ్య పేరు కూడా ఉందని ఈ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే రక్షారామయ్య గత ఆరు నెలలుగా చిక్కబళ్లాపురంలోనే ఉంటూ అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా బీఎన్ బచ్చేగౌడ గెలుపొందారు. క్రమేపీ ఆయన పార్టీకి దూరమవుతూ వచ్చారు. ప్రస్తుతం ఆయన కుమారుడు శరత్ బచ్చేగౌడ హొస్కొటె అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్నారు. రక్షా రామయ్య అభ్యర్థి అయితే బచ్చేగౌడ మద్దతు కూడా లభించే అవకాశాలు ఉంటాయని కాంగ్రెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. చిక్కబళ్లాపురం టికెట్‌ను మాజీ ముఖ్యమంత్రి ఎం.వీరప్పమొయిలీ కూడా ఆశిస్తున్నప్పటికీ ఆయనకు రానున్న రోజుల్లో కీలకమైన పార్టీ పదవిని అప్పగిస్తామని అధిష్ఠానం పెద్దలు భరోసా ఇస్తున్నట్లు సమాచారం. మరో వైపు మైసూరు-కొడగు లోక్‌సభా నియోజకవర్గం నుంచి ముఖ్యమంత్రి తనయుడు డాక్టర్ యతీంద్రను బరిలోకి దించాలని కాంగ్రెస్ నేతలు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. శాసనసభ ఎన్నికల్లో తండ్రి సిద్ధరామయ్య కోసం ఆయన వరుణ నియోజకవర్గాన్ని త్యాగం చేసిన సంగతి విదితమే. యతీంద్ర కాంగ్రెస్ అభ్యర్థి అయితే మైసూరు ప్రాంతంలోని బీజేపీ, జేడీఎస్ అసమ్మతి నేతల మద్దతు కూడా లభిస్తుందని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. బీజేపీ నుంచి ఈ రెండు సిట్టింగ్ స్థానాలను కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ పావులు కదుపుతోంది.



బెళగావి కాంగ్రెస్ టికెట్ రేసులో 'సుప్రీం' న్యాయవాది మోహన్

బెంగళూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో టికెట్లకోసం పోటీ తీవ్రమవుతోంది. బెళగావి స్థానానికి ఆశ్చర్యకరంగా సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మోహన్ కాతరకి పేరు తెరపైకి వచ్చింది. సుప్రీంకోర్టులో మహదాయి, కృష్ణ, కావేరి జల వివా దాలతోపాటు రాష్ట్రానికి సంబంధించి పలు కేసులలో కాతరకి సుదీర్ఘకాలంగా వాదనలు వినిపిస్తున్నారు. ఏఐ సీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం సిద్ధరామయ్యలతో సన్నిహిత సంబంధాలు ఉన్న మేరకు ఆయనకు టికెట్ దక్కనుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. బెళగావి జిల్లాకు చెందిన మోహన్ కాతరకి, నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్‌తో సంబంధాలు ఉన్నాయి. ఇప్పటికే బెళగావి నుంచి టికెట్ ఆశిస్తున్న 12 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిమధ్యనే పోటీ తీ వ్రంగా ఉంది. బెళగావికి చెందిన సీనియర్ మంత్రి సతీశ్ జార్కిహొళి కుమార్తె ప్రియాంక జార్కిహొళి, ఇదే జిల్లాకు చెందిన మరో మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ కుమా రుడు మృణాల్ హెబ్బాళ్కర్‌లు పోటీ పడుతున్నారు. వీరితోపాటు కిరణ్ సాధునవర, గిరీశ్ సోనూవాల్కర్‌లు కూడా టికెట్ ఆశిస్తున్నారు. బెళగావి లోక్‌సభ ఇన్‌చార్జ్ మంత్రి సతీశ్ జార్కిహొళిదే తుది నిర్ణయం కానుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.




మండ్య నుంచి లోక్‌సభకు కుమార సై



● చిక్కమగళూరు రిసార్టులో పార్టీ నాయకులతో రహస్య మంతనాలు

బెంగళూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మరోసారి బీజేపీకి అవకాశాలు ఉన్నాయనే సర్వేలతో కుమారస్వామి జాతీయ రాజకీయాల వైపు దృష్టి సారించారు. రాష్ట్రంలో బీజేపీతో జేడీఎస్ పొత్తుపెట్టుకున్న తరుణంలో అనూహ్యమైన పరిణామాలు చోటుచేసుకుంటున్నట్లు తెలుస్తోంది. బీజేపీతో పొత్తు విషయమై ఢిల్లీ పెద్దలతో చర్చలు సాగిన నేపథ్యంలోనే కేంద్రంలో మంత్రిని చేస్తామని కుమారస్వామికి భరోసా ఇచ్చినట్లు సమాచారం. రాష్ట్రంలోని 28 లోక్‌సభ స్థానాల్లో జేడీఎస్ మూడు లేదా నాలుగింటికి మాత్రమే పరిమితమై మిగిలిన అన్ని చోట్లా బీజేపీకి మద్దతు ఇవ్వాలని దాదాపు తీర్మానించినట్లు తెలుస్తోంది. వీటిలో హాసన్, మండ్యకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు సమాచారం. మండ్య లోక్‌సభ స్థానం నుంచి ఉమ్మడి అభ్యర్థిగా కుమారస్వామి రంగంలోకి దిగే అవకాశంపై రెండురోజులుగా కసరత్తు సాగుతోంది. చిక్కమగళూరు జిల్లాలోని ఓ రిసార్టులో మండ్య జిల్లాలోని అన్ని శాసనసభ నియోజకవర్గాల ముఖ్యనేతలతో చర్చలు జరిపారు. 2019 ఎన్నికల పరిణామాలను దృష్టిలో ఉంచుకుని చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. మండ్య నుంచి ప్రస్తుతం సుమలత ఇండిపెండెంట్ ఎంపీగా ఉన్నారు. ఇటీవలే ఆమె బీజేపీకి మద్దతు ప్రకటించారు. వాస్తవానికి రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా సుమలత రంగంలోకి దిగాలనే ఆలోచనలో ఉన్నారు. ప్రస్తుతం బీజేపీ- జేడీఎస్ మధ్య పొత్తుతో మండ్య స్థానం జేడీఎస్ నేతలు నిర్ణయించిన వారికే టికెట్ దక్కనుంది. అదే జరిగితే సుమలత కాంగ్రెస్‌లో చేరి అభ్యర్థి అవుతారా లేదా గతంలో మాదిరిగా ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తారా అనేది కీలకం కానుంది. ఇటీవల సుమలత పోటీ చేస్తే మండ్య మినహా మరో చోటుకు వెళ్లేది లేదని బహిరంగ ప్రకటన చేసిన అంశం కూడా చర్చించినట్లు తెలుస్తోంది. అభ్యర్థి మీరే అయితే వందశాతం కలిసి పనిచేద్దామని, పార్టీలో విభేదాలు, గ్రూపులు లేకుండా ముందుకెళదామని తాలూకా స్థాయి నాయకులు భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇటీవల కుమారస్వామి ఓ అడుగు ముందుకేసి సుమలతను కలుస్తానని అందులో తప్పేమిటని చేసిన ప్రకటన మండ్య పరిధిలో ఏవిధంగా పనిచేసిందనే అంశంపైనా చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. రాష్ట్ర రాజకీయాలను పూర్తిగా బీజేపీ నేతలకు వదిలేసి జాతీయ రాజకీయాల వైపు వెళ్లడం ద్వారా కేంద్రంలో మంత్రిగా కొనసాగవచ్చునని భావిస్తున్నట్లు తెలుస్తోంది. సంక్రాంతి పండుగ తర్వాత కుమారస్వామి ఢిల్లీ వెళ్లి సీట్ల అంశాన్ని కొలిక్కి తీసుకువచ్చిన వెంటనే మండ్య నుంచి పోటీ చేసే విషయాన్ని ప్రకటించనున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.97	1,621.97
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	000	8,115
సామర్థ్యం (టీఎంసీలు)	10.19	67.02

ఇండో అమెరికన్ కళాశాలలో సంక్రాంతి



భోగిమంటలతో కళాశాల బృందం వేడుకలు

బళ్లారి సిటీ, జనవరి 12: నగరంలోని ఇండో అమెరికన్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో సంక్రాంతి వేడుకలను శుక్రవారం వైభవంగా జరుపుకున్నారు. భోగి మంటల శోభతో విద్యార్థులు కోలాట నృత్యాన్ని ఎంతో ఉత్సాహంగా ప్రదర్శించి సంక్రాంతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు, లెక్చరర్లకు కుండల పోటీలు, టగ్ ఆఫ్ వార్, రంగోలి పోటీలు నిర్వహించారు. కార్యక్రమాలన్నీ అంగరంగ వైభవంగా సందడిగా జరిగాయి. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కళాశాల పాలకమండలి అధ్యక్షులు పి.హెచ్. నాయుడు, ప్రిన్సిపాల్ షేక్ సలీమ్‌బాషా, సుధీర్‌కుమార్, రాజేశ్, రాజా, పీఆర్వో, అడ్మినిస్ట్రేటర్ ఉదయ్ భాస్కర్, అధ్యాపక సిబ్బంది. విద్యార్థీనీవిద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ షేక్‌సలీం బాషా సంక్రాంతి సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులందరినీ, సిబ్బందిని అభినందించారు.

నగరంలో అభయ కప్ క్రికెట్ టోర్నమెంట్



పోటీలను ప్రారంభిస్తున్న డీసీ ప్రశాంత్‌కుమార్

బళ్లారి సిటీ, జనవరి 12: నగరంలోని విమ్స్ గ్రౌండులో మూడురోజుల జీసీఎస్ డెవలపర్స్ ఆధ్వర్యంలో అభయ్ కప్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం డీసీ ప్రశాంత్ కుమార్ మిశ్రా ప్రారంభించి మాట్లాడారు. రోజువారీ ఇలాంటి క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక, మానసిక సామర్థ్యాలు ఒనగూడుతాయన్నారు. తదనంతరం ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు మాట్లాడుతూ క్రీడా సంస్కృతి అభివృద్ధికి ఇలాంటి టోర్నీ ఎంతగానో దోహదపడుతుందన్నారు. క్రీడల్లో క్రమశిక్షణ ముఖ్యమని, కానీ బళ్లారిలో ప్రజలు ట్రాఫిక్‌తో సహా అనేక విషయాలలో క్రమశిక్షణ విషయంలో వెనుకబడి ఉన్నారన్నారు. ప్రజలు పాలనా నియమాలను పాటించాలని తెలిపారు. బళ్లారికి చెందిన రాష్ట్ర అండర్-15జట్టు క్రీడాకారుడు ప్రజ్ఞా కిషోర్‌ను సన్మానించారు. జీసీఎస్ ఈ టోర్నమెంట్‌కు ప్రధాన స్పాన్సరర్ డెవలపర్స్ ఓనర్ గోపాలరెడ్డి, అభయ టీమ్ రామకృష్ణ, కిషోర్ దండిన, నమ్‌కార్తీక్, బాలనాగరాజ్, అజయ్, నాగార్జున తదితరులు ఉన్నారు. ఈటోర్నమెంట్‌లో నగరం నుండి 30 జట్లు పాల్గొన్నాయి. ఇందులో రెండు గ్రూపులు ఉన్నాయి. 8 ఓవర్ల మ్యాచ్, లీగ్ కమ్ నాకౌట్ దశలో జరుగుతుంది. సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు జనవరి 14న జరుగుతాయి.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడి మృతి



నరసింహమూర్తి (ఫైల్)

కంప్లి, జనవరి 12 : కొత్త దరోజీలో కాంగ్రెస్ సీనియర్ నేత నరసింహమూర్తి మృతిచెందారు. ఎంతోకాలంగా ఆయన కాంగ్రెస్‌లో కొనసాగుతుండేవారు. ఆయన మృతితో ఎమ్మెల్యే తుకారామ్, గ్రామ పంచాయతీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, పంచాయతీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు.

చిన్నారుల ఆరోగ్యమే ముఖ్యం

సిరుగుప్ప, జనవరి 12: తనకు చిన్నపిల్లల ఆరోగ్యమే ముఖ్యమని, పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ రవీంద్రనాథ్ పేర్కొన్నారు. సిరుగుప్ప పట్టణఆస్పత్రిలో చిన్నపిల్లల వైద్యులుగా పనిచేసిన ఆయన వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నారు. అనంతరం పట్టణంలో చైతన్య భవనం పక్కన శ్రీసాయిరామ్ ప్రైవేటు ఆస్పత్రిలో పిల్లలకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఇటీవల విదేశాల నుంచి తిరిగివచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లలకు మంచి వైద్యసేవలు అందించడం కోసం శిక్షణ కోసం విదేశాలకు వెళ్లినట్లు తెలిపారు. ఎక్కడవున్నా పిల్లలకు ఉత్తమ వైద్యసేవలు అందిస్తానన్నారు

లే! మేలుకో! గమ్యం చేరుకో!

స్వామి వివేకానంద వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు

ఉత్తిష్ఠ, జాగృత, ప్రాప్యవరాన్నిబోధిత (లే! మేలుకో! గమ్యం చేరుకో!) అంటూ స్వామి వివేకానంద చికాగోలో ఇచ్చిన పిలుపును ఆ చిన్నారులు మరొకసారి స్మరించుకున్నారు. వివేకానంద జయంతి సందర్భంగా శుక్రవారం పాఠశాలల్లో చిన్నారులు ఆయన వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా అన్నిచోట్ల యువజన దినోత్సవం జరుపుకున్నారు. పలు చోట్ల పాఠశాలల్లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుడితిని పట్టణంలోని సత్సంగ ఆశ్రమ పిల్లలు, కొత్త దరోజీ చిన్నారులు, కురుగోడు ఎస్‌డీఎం పాఠశాల విద్యార్థులు స్వామీజీ వేషధారణతో జయంతి వేడుకలు జరుపుకున్నారు. ప్రముఖులు చిన్నారులకు ఆయన జీవిత చరిత్రను వివరించారు. ✍ కంప్లి



కుడితిని సత్సంగ ఆశ్రమంలో ఆకట్టుకున్న పిల్లల వేషధారణ

వృద్ధులకు ఇంటివద్దనే వైద్యం

- కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు

బళ్లారి సిటీ, జనవరి 12: జాతీయ పాలియేటివ్ కేర్ కార్యక్రమం ద్వారా వృద్ధులకు కుటుంబసంక్షేమ శాఖ సహాయాన్ని అందిస్తోందని ఆ శాఖాధికారి డా.రమేశ్‌బాబు తెలిపారు. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధులకు, వేరొకరి సహాయం అవసరమైన వారికి సహాయాన్ని అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని 97 హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఇంటిలో మంచాన పడిన కుటుంబంలోని వృద్ధులకు అక్కడిక్కడే రక్తపోటు పరీక్ష, మధుమేహం పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తారన్నారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో ఫిజియోథెరపీ అవసరమైన వారికి బళ్లారి జిల్లా ఆస్పత్రిలో ఎన్‌సీడీ స్పెషలిస్ట్ డాక్టర్ల సేవ కూడా అందిస్తారని తెలిపారు. జిల్లా సర్వేయర్ డాక్టర్ మరియాండి, జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ జుబీన్ పర్యవేక్షణలో జిల్లాలో ఈ కార్యక్రమం సమర్థవంతంగా జరుగుతోందన్నారు. ప్రజలు సమీపంలోని ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వీధినపడ్డ ఫుట్‌పాత్ వ్యాపారులు

- ప్రారంభానికి నోచుకోని దుకాణాలు
- ప్రభుత్వం మారడంతో పట్టించుకోని కార్పొరేషన్

బళ్లారి గాంధీనగర్, జనవరి 12: ఫుట్‌పాత్ వ్యాపారులకు ఒకటే గూడు కింద దుకాణాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందనే ఉద్దేశ్యంతో గత ఏడాది బళ్లారి సిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 13 ఫుట్‌పాత్ దుకాణాలను నిర్మించారు. జిల్లా ఖనిజ నిధి(డిఎంఎఫ్) సంస్థ వీటి కోసం రూ.61లక్షలు వెచ్చించింది. బుడా సమీపంలో నిర్మించిన వీటిని గత ఏడాది శాసనసభ ఎన్నికల సందర్భంగా అప్పటి జిల్లా మంత్రి బి.శ్రీరాములు, సీటీ ఎమ్మెల్యే జి.సోమశేఖర్ రెడ్డి హడావుడిగా ప్రారంభించారు. కార్పొరేషన్ పాలక మండలి అధికారులు ఫుట్‌పాత్ వ్యాపారులకు ఈ దుకాణాలను కేటాయించకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి.

గతంలో ఇదే ప్రాంతంలో ఫుట్‌పాత్‌పై చాలామంది దుస్తులు, చిరు హోటళ్ల వ్యాపారులు తాత్కాలిక బండ్లు ఏర్పాటు చేసుకుని జీవనం సాగించే వారు.



వ్యాపారులకు కేటాయించకపోవడంతో తెరుచుకోని దుకాణాలు

కొత్తగా దుకాణాలు నిర్మించే నెపంతో వారందరినీ అక్కడి నుంచి ఖాళీ చేయించారు. ప్రస్తుతం వారంతా వీధుల పాలయ్యారు. కార్పొరేషన్ అధికారుల పుణ్యమా అంటూ... జీవనోపాధి కోల్పోవాల్సి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే షాపుల ముందు తాత్కాలికంగా అంగళ్ళు ఏర్పాటు చేసునేందుకు అధికారులు అవకాశం ఇవ్వడంలేదని వాపోతున్నారు. డీఎంఎఫ్ గ్రాంట్ క్రింద సుమారు రూ.61లక్షల వ్యయంతో నిర్మించిన ఫుట్‌పాత్ అంగళ్ళు కేటాయించే విషయంలో స్థానిక కార్పొరేటర్ల ప్రభావం ఉండడంతో ఫుట్‌పాత్ వ్యాపారస్తులకు ఏ షరతులు కింద, ఎలాంటి నిబంధలు క్రింద అంగళ్ళ కేటాయించాలో అర్థం కాక అధికారులు తర్జనభర్జన పడాల్సి వస్తోంది. ప్రస్తుతం కార్పొరేషన్‌కు సంబంధించి నగరంలోని చాలాప్రాంతాల్లో దుకాణాలు ఉన్నాయి. ఈ మధ్యనే కొన్నిటిని ఆన్‌లైన్ ద్వారా వేలం వేసి వాటిని కేటాయించారు. ఈ విధంగా తక్కువ మొత్తంలో షాప్ అలాట్ చేసుకుని అందుకు పదింతలు అదనంగా అద్దెకు ఇస్తున్న తంతు ప్రస్తుతం కార్పొరేషన్‌లో నడుస్ను విషయం బహిరంగ రహస్యమే. అయినా... కార్పొరేషన్ అధికారులు మాత్రం బహిరంగ టెండర్‌లో నమోదైన మొత్తం వస్తే చాలన్నట్లు.. మౌనం దాలుస్తున్నారు. అయితే ప్రస్తుతం నిర్మించిన ఫుట్‌పాత్ దుకాణాలు కేవలం పేదవర్గాల కోసం నిర్మించినందున వారికి కార్పొరేషన్ నిబంధనల ప్రకారం వాటిని కేటాయించాల్సి ఉంది. గతంలో ఈ ప్రాంతంలో ఉన్న వ్యాపారులు వాటిని తమకే ఇస్తామని హామీ ఇచ్చారని, ప్రస్తుతం దుకాణాలు కేటాయించే విషయంలో అధికారులు నోరు మెదపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనా చిన్నవ్యాపారుల కోసం నిర్మించిన ఈ దుకాణాలను తమకు పంపిణీ చేయాల్సిందిగా నగరానికి చెందిన పలువురు ఫుట్‌పాత్ వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు.

బళ్లారి నగరాభివృద్ధికి కృషి చేస్తా

- మేయర్ శ్వేత.. బాధ్యతల స్వీకరణ
- శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, కార్పొరేటర్లు



బాధ్యతలు చేపట్టిన మేయర్‌శ్వేతకు అభినందనలు తెలుపుతున్న కార్పొరేటర్లు

బళ్లారి.జనవరి 12(ఆంధ్రజ్యోతి): బళ్లారి మేయర్‌గా బి.శ్వేత సోము శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. నగర పాలిక కార్యాలయంలో ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి, నగర కమీషనర్ ఖలీల్, ఇతర కార్పొరేటర్లు ప్రభంజన్, సోము, ముల్లంగి నందీశ్‌బాబు, పుష్పగుచ్ఛం ఇచ్చి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ అందరితో కలిసి బళ్లారి అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. సహచర కార్పొరేటర్లు ఆమెకు అభినందనలు తెలిపారు.

కార్పెంటర్లకు వైద్య పరీక్షలు



ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

బళ్లారి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ప్లైవుడ్ కంపెనీ ఆధ్వర్యంలో శుక్రవారం బళ్లారిలో కార్పెంటర్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రీన్ గ్రీన్ ప్లైవుడ్ మేనేజర్ అనూప్‌కుమార్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి, భవన నిర్మాణాలకు అత్యధికంగా ఉపయోగించే ప్లైవుడ్ పనిచేసే కార్పెంటర్లు ఆరోగ్య కరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా వారి ఆరోగ్య భద్రత నిమిత్తం వివిధ ఆరోగ్యపరీక్షలు నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్కిటిక్స్ ఈశ్వర్ గౌడ, మంజీస్, రాజీవ్, ప్రకాశ్, శృతి, శ్వేత, కాంగ్రెస్ నాయకుడు, కార్పొరేటర్ గుమ్మనూర్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఛాందసవాదం దేశానికి ప్రమాదకరం: ప్రకాష్ కుగ్వే

బళ్లారి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): హిందూ-ముస్లిం ఛాందసవాదం రెండూ దేశానికి ప్రమాదకరమని సీనియర్ జర్నలిస్టు, రచయిత ప్రకాష్ కుగ్వే ఆవేదన వ్యక్తం చేశారు. పత్రికల్లో రాగద్వేషాలతో కూడిన వార్తలు సమాజంలోని సామరస్యాన్ని దెబ్బతీస్తున్నాయన్నారు. బళ్లారిలోని సరళాదేవి సతీశ్‌చంద్ర అగర్వాల్ ప్రభుత్వ కళాశాలలో శుక్రవారం ప్రింట్ మీడియా, బహుముఖ కోణాలు అనేనే అంశంపై ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సత్యం- అసత్యం మధ్య ఉన్న తేడాను అర్థం చేసుకోవాలన్నారు. అలాగే సీనియర్ పాత్రికేయుడు, రచయిత అయిన వీరేంద్ర పీ.ఎం మాట్లాడుతూ సాహిత్యానికి మీడియా వేదికని, ఆధునిక రచయితలు, కవులకు, మరిన్ని అవకాశాలు కల్పించారన్నారు. ఉజిరె ఎస్‌డిఎం కళాశాల జర్నలిజం విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ విరాల్ పద్మనాభం మాట్లాడుతూ ప్రపంచంలోని మహానుభావులంతా పేదరికంలో పుట్టినవారేనన్నారు. కార్యక్రమంలో వీరితో పాటు ప్రిన్సిపాల్ మంజునాథ్‌రెడ్డి, బసవరాజు, హిందూ అహిరాజు, కస్తూరి నాగరాజు, తిమ్మప్ప చైదరి, వంజునాథ, మురళీ, కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఉత్తమ జర్నలిస్టులుగా వివిధ అవార్డులు అందుకున్న కన్నడ ప్రభ బ్యూరో చీఫ్ మంజునాథ, ప్రజావాణి సీనియర్ జర్నలిస్టు నంజుండే గౌడను ఈసందర్భంగా సత్కరించారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జర్నలిస్టులు

సంపూర్ణ మెజార్టీతో అధికారంలోకి టీడీపీ: దీపక్ రెడ్డి



బళ్లారిలో దుర్గామాతను దర్శించుకున్న దీపక్‌రెడ్డి

బళ్లారి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఏపీలో తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మెజార్టీతో అధికారంలోకి రాబోతుందని తెలుగుదేశం పార్టీ జాతీయ మీడియా కో-ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్సీ గుణపాటి దీపక్‌రెడ్డి చెప్పారు. ప్రస్తుత వైఎస్సార్ ప్రభుత్వంపై ప్రజలు విసిగెత్తిపోయారన్నారు. నారా లోకేష్ బాబు పాదయాత్ర, యువగళం కార్యక్రమంలో ప్రజలు అన్ని చోట్లా ఆయనకు బ్రహ్మరథం పట్టారని తెలిపారు. జగన్ మోహన్‌రెడ్డి దోపిడీలు, దౌర్జన్యాలకు ఏపీ ప్రజలు విసిగెత్తిపోయారన్నారు. శుక్రవారం బళ్లారిలోని దుర్గామాతను ఆయన దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాయదుర్గం నియోజక వర్గంలో మాజీ జెడ్పీ చైర్మన్ పూల నాగరాజు ఆహ్వానం మేరకు అక్కడ అమ్మవారి పూజలకు వెళుతున్నట్లు తెలిపారు. రాయదుర్గం నియోజక వర్గంలో టీడీపీ కార్యకర్తలు బలంగా ఉన్నారన్నారు. రాయదుర్గం శాసనసభ నుంచి పోటీ చేయడానికి టికెట్ ఆశిస్తున్నారా? అని విలేకరులు ప్రశ్నించగా తాను ఇప్పటి వరకూ ఏమీ అనుకోలేదని తమ అధినేత చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ ఏమి ఆదేశించినా శిరసావహిస్తామని తెలిపారు. ఆయన వెంట బుడుగు నాగేశ్వరరావు, ప్రకాష్, మాజీమేయర్‌గుర్రం రమణ, మోహన్‌దాస్, తదితర కార్యకర్తలు. నాయకులు ఉన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



చోరీ కేసులో అరెస్టు చేసిన నిందితుడితో పోలీసులు

బళ్లారిరూరల్, జనవరి 12 : కువెంపు నగర్ సమీపంలో దొంగతనానికి పాల్పడిన బాబునాయక్‌ను అదుపులోకి తీసుకున్నట్లు కౌల్ బజార్ సీఐ సుభాష్ చంద్ర తెలిపారు. కౌల్ బజారు సమీపంలోని గౌతమ్ నగర్‌కు చెందిన గంగాధర్ నాయక్ అలియాస్ బాబు నాయక్ (22) నగరంలో గతంలో పలు చోరీలకు పాల్పడ్డాడన్నారు. ఎస్పీ రంజిత్ కుమార్ భండారి ఆదేశాలతో నగరంలో గస్తీ నిర్వహించి దొంగతనానికి పాల్పడిన అతడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 18 తులాల బంగారం, 270 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి అతనిని రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిటీ డీఎస్పీ చంద్రకాంత్ నందరెడ్డి, ఎస్‌ఐలు సోమయ్య, లారెన్స్, షహనాజ్, పోలీసు సిబ్బంది నాగరాజు, అన్వర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

వాహన తయారీ రంగంలో మేటి టీవీఎస్



హోసూరులో టీవీఎస్ సంస్థ అభినందన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వక్తలు

హోసూరు జనవరి 12 : టీవీఎస్ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా ద్విచక్ర వాహనాల తయారీల్లో అగ్రగామిగా మారిందని ఐఎన్‌టియూసీ జాతీయ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే కె.ఏ.మనోహరన్ అన్నారు. హోసూరు ప్రజల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన టీవిఎస్ వేడుకల్లో ఆయనపాల్గొని సంస్థ సేవలను ఘనంగా కొనియాడారు. ఈ కార్యక్రమానికి పెరుమాళ్ మణిమేగలై కళాశాల అధ్యక్షుడు పి.కుమార్ అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్యే మనోహరన్ మాట్లాడుతూ కేంద్ర మాజీ మంత్రి సి.సుబ్రహ్మణి 3000 ఎకరాల్లో పారిశ్రామిక పార్క్‌ను నిర్మించాలని ప్లాన్ చేశారని, అందుకోసం సిప్‌కాట్ చైర్మెన్‌గా ఎంజీ రాజారాం అనే ఐఏఎస్ అధికారిని నియమించారన్నారు. ఆ సందర్భంగా డీఎంకే హయాంలో టీవిఎస్ శ్రీనివాసన్ 1973లో టీవిఎస్ కర్మాగారం నిర్మాణం చేసి అందుల్లో మొట్ట మొదట 30 వేలు ద్విచక్ర వాహనాలను తయారు చేశారని తెలిపారు.

టీవీఎస్ వాహనాలను ప్రపంచ వ్యాప్తంగా పాలు వ్యాపారి నుంచి, వ్యవసాయ దారుల వరకూఉపయోగించడం ప్రారంభించారన్నారు. అదే విధంగా హోసూరులో లైలాండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.జే.సగానీ లారీలు, ట్రక్కులు, తయారీని తీసుకొచ్చారన్నారు. అదే విధంగా ప్రీమియర్ మిల్, తిరుమలై ఎలక్ట్రానిక్స్, ప్రారంభించిన తర్వాత హోసూరు స్థాయి పెరిగిందన్నారు. కార్యక్రమంలో హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాశ్, మేయర్ సత్య, మున్సిపల్ హెల్త్ కమిటీ చైర్మెన్ మాదేశ్వరన్, కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా కార్యదర్శి సత్యమూర్తి, ఐఎన్‌టియూసీ కార్యదర్శి మునిరాజ్, జాన్‌బాస్కో హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎంజెలా పాల్గొన్నారు.

వేరుశనగ పంటసాగుపై శిక్షణ

హోసూరు(మత్తిగిరి) జనవరి 12: హోసూరులో ప్రభుత్వం తరఫున (ఆత్మ ప్రాజెక్ట్) అత్తూరు గ్రామంలో వేరుశనగ పంటలో సమగ్ర పంట నిర్వహణపై రైతులకు శుక్రవారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణలో 40 మందికి పైగా రైతులు పాల్గొన్నారు. ఈ శిక్షణలో అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసన్ మాట్లాడుతూ, రైతులకు వేరుశనగ సాగులో బిందు సేద్యం ప్రాముఖ్యత, చిరు ధాన్యాల సాగు పద్ధతులు, దాని ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించారు, వ్యవసాయసహాయ సంచాలకులు భువనేశ్వరీ మాట్లాడుతూ, రైతులకు సేంద్రియ వ్యవసాయం, జీవ ఎరువులు, సూక్ష్మపోషకాల లోపం వల్ల వచ్చే వ్యాధులు, దానినివారణ గురించి తెలిపారు, అదియమాన్ వ్యవసాయ కళాశాల పరిశోధనా కేంద్రం, అత్తిముగం వ్యవసాయ సాంకేతిక నిపుణుడు రాజ్‌కుమార్ వేరుశనగలో ఉత్పాదకతను మెరుగుపరచడానికి సాంకేతిక పద్ధతులను పంటల ప్రయోజనాలను, తెగుళ్ల గురించి తెలిపారు. వ్యవసాయ సహాయ అధికారి మురుగేశన్ మాట్లాడుతూ, విత్తన శుద్ధి ప్రాముఖ్యత, జిప్సం బెడ్ కంపోస్టింగ్ వల్ల కలిగే ప్రయోజనాలు, బయోఎరువులు వల్ల కలిగేప్రయోజనాలు, వ్యవసాయ శాఖ సబ్సీడీ పథకాలు గురించి రైతులకు వివరించారు. ఈ శిక్షణకు సంబంధించిన ఏర్పాట్లను అసిస్టెంట్ టెక్నికల్ మేనేజర్ షణ్ముగం చేశారు.



బిందు సేద్యం ప్రాముఖ్యం గురించి వివరిస్తున్న అధికారులు

యువతకు స్ఫూర్తిప్రదాత స్వామి వివేకానంద

రాయచూరు, జనవరి 12: భారతదేశ ఆధ్యాత్మిక ప్రతిష్ఠను, విశిష్టతను ప్రపంచానికి చాటిన స్వామి వివేకానందుడు నేటితరం యువతకు స్ఫూర్తిగా నిలిచారని రాయచూరు ఎంపీ రాజ అమరేశ్వర్ నాయక్ కీర్తించారు. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో నిర్వహించిన స్వామి వివేకానంద 161వ జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తన ప్రసంగాల ద్వారా జాతిని ఉత్తేజితం చేసిన స్వామి వివేకానందుడు యువత గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచారన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ దేశ అభ్యున్నతి కోసం శక్తివంచనలేకుండా కృషి చేయాలన్నారు. ప్రపంచంలో భారతదేశాన్ని 5వ ఆర్థికంగా శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రధాని మోదీ చేస్తున్న ప్రయత్నానికి యువత అండగా నిలవాలని అభ్యర్థించారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రాజ అమరేశ్వర్ నాయక్

కురుబ సమాజమంతా ఒకే వేదిక పైకి..

రాయచూరు, జనవరి 12: సామాజికంగా వెనకబడి ఉన్నప్పటికీ అన్ని రంగాల్లో తమదైన ప్రతిభను చాటుతూ గుర్తింపు పొందుతున్న కురుబ సమాజానంతటిని ఒకే వేదికపైకి తేవాలన్నదే తమ లక్ష్యమని మాజీ మంత్రి, షెపర్డ్ ఇండియా ఇంటర్‌నేషనల్ సంస్థ అధ్యక్షుడు హెచ్.విశ్వనాథ్ అన్నారు. ఆ సంస్థ ప్రాంతీయ విభాగం సమావేశాన్ని శుక్రవారం నగరంలో నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న హెచ్.విశ్వనాథ్, గత మూడేళ్లుగా తాను అనేక దేశాలు సంచరించానని కురుబ సమాజం అన్ని చోట్ల తమదైన ప్రతిభతో ముందడుగు వేస్తుండడం ఆనందాన్నిచ్చిందన్నారు. కాగా తాను విద్యాశాఖ మంత్రిగా పని చేసిన కాలంలో రాయచూరు జిల్లాలో 500 పాఠశాలల నిర్మాణంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ఈ జిల్లాకు 12వేల మంది ఉపాధ్యాయులను బదిలీ చేసినట్లు గుర్తు చేసుకున్నారు. నిరుపేదల పిల్లలకు అలంబనగా ఉండేందుకే అప్పట్లోనే మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. కాగా కురుబ సమాజం కులవృత్తిగా భావించే గొర్ల పెంపకాన్ని వృత్తిగా కాకుండా పరిశ్రమగా గుర్తించి అభివృద్ధి చెందాలన్నారు. అదే సమయంలో శంకరచార్యులు, ఇతర మతపెద్దలు చెప్పే మాటలను అందరూ గౌరవించాలన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి హెచ్.విశ్వనాథ్

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

మర్రి చెన్నారెడ్డి (జయంతి)



సమైక్య ఆంధ్రప్రదేశ్‌కు రెండుసార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన మర్రి చెన్నారెడ్డి 1919 జనవరి 13న వికారాబాద్ తాలూకా సిరిపురం ప్రాంతంలో జన్మించారు. ఎంబీబీఎస్ పట్టభద్రుడైనా కాంగ్రెస్ పార్టీ నేతగా రాణించారు. మహాత్మా గాంధీజీ పిలుపుతో ఆంధ్రమహాసభలో చేరి ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. అనేక పత్రికలకు వ్యాసాలు రాశారు. ఆంధ్ర యువజన సమితి, విద్యార్థి కాంగ్రెస్ వ్యవస్థాపకుడిగా పలు స్థాయిలలో పనిచేశారు. ఉత్తర ప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు రాష్ట్రాలకు గవర్నర్‌గా వ్యవహరించారు. 1996 డిసెంబరు 2న కన్నుమూశారు.

పండిట్ శివకుమార్ శర్మ (జయంతి)



పద్మవిభూషణ్ గ్రహీత పండిట్ శివకుమార్ శర్మ 1938 జనవరి 13న జమ్మూలో జన్మించారు. హిందూస్థాన్ సంగీత శైలి సంతూర్ వాద్య కళాకారులు. సంతూర్ వాద్య పరికరానికి గుర్తింపు తెచ్చిన ఘనత ఆయనదే. పండిట్ హరిప్రసాద్ చౌరాసియాతో కలసి 'శివ-హరి' ద్వయంగా పలు సంగీత కచేరీలు నిర్వహించారు. హిందీ సినిమాలకు సంగీతం అందించారు. పద్మశ్రీ, సంగీత నాటక అకాడమీ తోపాటు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు పొందారు. 2022 మే 10న కన్నుమూశారు.

అంజలీదేవి (వర్ధంతి)



అభినవ సీతమ్మగా పేరొందిన అంజలీదేవి 1927 ఆగస్టు 24న తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురంలో జన్మించారు. అసలు పేరు అంజనీకుమారి. నర్తకి కూడా. రంగస్థలంతో నటనాజీవితాన్ని ప్రారంభించారు. 'లవకుశ' సినిమాలో ఎన్‌టీ రామారావు సరసన నటించిన సీత పాత్ర ఆమెకు ఎంతో గుర్తింపు వచ్చింది. ఆమె భర్త పి. ఆదినారాయణరావు తెలుగు సినీ దర్శకుడు. ఆమె తెలుగు, తమిళ, కన్నడ భాషలలో దాదాపు 500 చిత్రాలలో నటించారు. అంజలీ పి క్చర్స్ బ్యానర్‌పై 27 సినిమాలు రూపొందించారు. నాగార్జున యూనివర్సిటీచే గౌరవ డాక్టరేట్, ఇతర పురస్కారాలు పొందారు. 2014 జనవరి 13న కన్నుమూశారు.

బెళగావి ఆసుపత్రులకు నోటీసులు

» మహారాష్ట్ర ఆరోగ్య బీమా పథకం వర్తింపు నేపథ్యంలో..

బెంగళూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పరిధిలోని బెళగావి ప్రాంతంలో మహారాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య బీమా పథకాన్ని వర్తింపచేసిన మేరకు పలు ఆసుపత్రులకు వైద్యఆరోగ్యశాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. 24గంటల వ్యవధిలో వివరణ ఇవ్వాలని లేని పక్షంలో చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని నోటీసులలో స్పష్టం చేశారు. బెళగావి జిల్లా పరిధిలోని పలు తాలూకాలలో మహారాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య బీమా పథకాన్ని వర్తింప చేసింది. ఇప్పటికే ఆరోగ్య కార్డులను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. మహారాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆరోగ్యకార్డుల విషయాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు సమాచారం ఇవ్వకుండానే అమలు చేసేందుకు సిద్ధమైన మేరకు శుక్రవారం జిల్లా వైద్యాశాఖాధికారి మహేష్‌కోణి నోటీసులు జారీ చేశారు. ఏ నిబంధనల కింద మహారాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నారు, ఇప్పటి దాకా ఎంతమందికి నోటీసులు జారీ చేశారనేది రోగుల వివరాలతో పాటు సమగ్రంగా నివేదిక ఇవ్వాలని కెఎల్‌ఈ, అరిహంత ఆసుపత్రులకు నోటీసులు జారీ చేశారు. సరిహద్దులో మహారాష్ట్ర రెచ్చగొట్టేలా చేస్తున్న విధానాలకు ఆసుపత్రులు ఎలా సహకరిస్తాయని కన్నడ సంఘాలు మండిపడ్డాయి.

రైలు ఢీ కొని అపరిచిత వ్యక్తి మృతి

చింతామణి, జనవరి 12: పట్టణంలోని అంబాజిదుర్గ హోబళి కోనపల్లి సమీపాన రైల్వే అండర్‌పాస్ సమీపాన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. రెండురోజులక్రితం మురగమల్లా రోడ్డులోని కరియప్పల్లి సమీపాన ఐటీఐ విద్యార్థి రైలు కిందపడి మృతి చెందిన సంఘటన మరవకముందే మరో ఘటన జరిగింది. మృతుడికి సుమారు 40ఏళ్లు ఉంటాయని పోలీసులు వెల్లడించారు. కోనపల్లి సమీపాన మదర్‌సాబ్ అనే వ్యక్తి భూమిలో రైల్వే పట్టాల పక్కన పడి ఉన్న వ్యక్తిని స్థానిక రైతులు గమనించి చింతామణి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. బిస్కట్ రంగు ఫుల్‌షర్ట్, నలుపురంగు ప్యాంట్ ధరించాడని ఇతడి ఆచూకీ గురించి ప్రజలు సహకరించాలని పోలీసులు కోరారు.

యువత ప్రపంచంతో పోటీ పడాలి

- చిక్‌బళ్లాపూర్ ఎమ్మెల్యే ప్రదీప్‌ఈశ్వర్

పావగడ, జనవరి 12: యువత ప్రపంచంతో పోటీ పడినప్పుడే విజయతీరాలకు చేరుకుంటారని చిక్‌బళ్లాపూర్ ఎమ్మెల్యే ప్రదీప్‌ఈశ్వర్ అన్నారు. శుక్రవారం ఎస్‌ఎస్‌కే రంగమందిరంలో విస్తారా చానల్ ఎస్‌ఎస్‌కే సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామివివేకానంద రాష్ట్ర యువజన దినోత్సవ కార్యక్రమంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నేటి యువత ప్రపంచంతో పోటీపడే అవకాశం ఉండి ఆ సమయాన్ని వృథాచేసి సెల్‌ఫోన్‌లతో జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులను దైవంగా భావించి వారిని పూజిస్తే ప్రతి ఒక్కరి జీవితంలోనూ విజయం తనంతట తానే వరిస్తుందని హితువు పలికారు. ఎంతటిక్లిష్టమైన పరిస్థితుల్లోనూ అధైర్యపడకుండా తమ లక్ష్యం సాధించేవరకు పట్టుదల వదలవద్దని వివేకానంద చెప్పిన మాటలు గుర్తుచేశారు. అనంతరం ఆయన స్థానిక శనేశ్వరాలయం, యోగినారాయణస్వామి ఆలయాన్ని సందర్శించి మొక్కుబడి తీర్చుకున్నారు. పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్, విశ్రాంత న్యాయాధికారి బిల్లప్ప, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ముగ్గుల పోటీలు

పావగడ, జనవరి 12: మకరసంక్రాంతి సందర్భంగా హెల్ప్‌సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గులపోటీలు నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్ తెలిపారు. సాయిబాబా నగర్‌లోని సాయిబాబా ఆలయప్రాంగణంలో ఆదివారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు పోటీలు ఉంటాయన్నారు. మొదటి బహుమతి రూ.5,001, రెండో బహుమతి రూ.3001, మూడో బహుమతి రూ.2001 అందజేస్తున్నట్లు తెలిపారు. ముగ్గులకు కావాల్సిన రంగులన్నీ వారే స్వయంగా తెచ్చుకోవాలని ఆయన సూచించారు.

14 అకాడమీలకు కమిటీలే కరువు

● ఏడు నెలలు ముగిసినా... కన్నడ సాంస్కృతిక శాఖపై ప్రభుత్వ నిర్లక్ష్యం ● కొనసాగుతున్న అధికారుల హవా

బెంగళూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కన్నడ భాష-సంస్కృతికి సంబంధించి కార్యక్రమాల రూపకల్పన, అమలు చేయాల్సిన కన్నడ సంస్కృతి శాఖలో 14 అకాడమీలు, నాలుగు ప్రాధికారలకు కమిటీలు లేక బోసిపోతున్నాయి. కన్నడ సాంస్కృతిక శాఖలో అధికారులదే హవాగా సాగుతోంది. కన్నడ భాష సంస్కృతి కోసమే పనిచేసే సంస్థలకు తగిన పాలకవర్గాలు లేని కారణంగా ఎటువంటి తీర్మానాలు సాధ్యం కావడం లేదు. సాధారణంగా ప్రభుత్వం మారిన వెంటనే బోర్డులు, కార్పొరేషనల్‌కు కమిటీలు రద్దు అయిన తీరులోనే కన్నడ సంస్కృతిశాఖకు అనుబంధంగా ఉండే విభాగాల కాలపరిమితి ముగిసినట్లు అయ్యింది. బీజేపీ ప్రభుత్వ హయాంలో అన్ని కమిటీలను పాలకవర్గాలు భర్తీ చేయడంతో నిరంతరంగా కన్నడ కార్యక్రమాలు సాగుతుండేవి. గత ఏడాది మే నెలలో శాసనసభ ఎన్నికలు జరుగగా సమగ్ర మెజారిటీ సాధించిన కాంగ్రెస్ పార్టీ సిద్ధరామయ్య నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడింది. రాష్ట్రవ్యాప్తంగా ఉండే బోర్డులు కార్పొరేషన్‌లకు అధ్యక్షులను నియమించే విషయంలో నాలుగునెలలుగా కసరత్తు సాగుతోంది. వీటి ద్వారా మంత్రి పదవులు దక్కని సీనియర్ ఎమ్మెల్యేలకు, పార్టీ కోసం సుదీర్ఘకాలం పనిచేసిన వారికి అవకాశాలు కల్పించడం ద్వారా అందరినీ సమన్వయపరిచే ప్రక్రియ సాగుతుంది. బోర్డులు, కార్పొరేషన్‌లలో కోట్లాది రూపాయల టర్నోవర్ కలిగిన సంస్థలు, ఇతరత్రా సౌలభ్యాలు ఉండటం ద్వారా ప్రజాప్రతినిధులు ఎక్కువమంది మొగ్గుచూపుతారు. కానీ కన్నడ సంస్కృతి శాఖకు అనుబంధమైన విభాగాలలో సాహితీవేత్తలు, భాష, సంస్కృతి కోసం పాటుపడే ఆసక్తి కలిగిన వారు మాత్రమే ముందుకు వస్తుంటారు. అయినా కమిటీలను వేయడంలో జాప్యం జరుగుతోంది. కన్నడ సంస్కృతి శాఖా మంత్రిగా శివరాజ్‌తంగడిగ వ్యవహరిస్తున్నారు. 14 అకాడమీలు నాలుగు ప్రాధికారల కోసం ఇప్పటికే ఒకటి రెండుసార్లు జాబితాలను సిద్ధం చేసినా సామాజికవర్గంతో పాటు ఇతరత్రా కారణాలతో వాయిదాలు పడ్డాయి. కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రత్యేకించి సీఎం సిద్దరామయ్య అంటే సాహితీవేత్తలకు ప్రత్యేక అభిమానం ఉందనేది తెలిసిన విషయమే. ఇలా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే సాహితీ వేత్తలు, కళాకారులు అకాడమీలలో పదవులు పొందవచ్చునని ఎనలేని ఉత్సాహం చూపారు. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం అన్నింటికంటే ఐదు గ్యారెంటీలను ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలనే పట్టుదలతో ఉంది. 18మంది కమిటీలు, సభ్యులను నియమించుకుంటే ఆర్థికంగా కూడా పెనుభారం కానుందనే వెనకడుగు వేస్తున్నట్టు తెలుస్తోంది.



కమిటీలు ఇవే....

కర్ణాటక సాహిత్య అకాడమి, జానపద అకాడమి, సంగీతనృత్య అకాడమి, శిల్పకళా అకాడమి, లలితకళా అకాడమి, నాటక అకాడమి, యక్షగాన అకాడమీ, తుళు సాహిత్య అకాడమీ, బ్యారీ సాహిత్య అకాడమి, కొడవ సాహిత్య అకాడమి, అరభాష సంస్కృతి సాహిత్య అకాడమి, బయలాట అకాడమి, బంజార సంస్కృతి భాషా అకాడమిలు కాగా కన్నడ పుస్తక ప్రాధికార, కువెంపు భాషా భారతీ ప్రాధికార, కన్నడ అభివృద్ధి ప్రాధికార, కర్ణాటక గడి (సరిహద్దు) అభివృద్ధి ప్రాధికారలకు అధ్యక్ష కార్యదర్శులు ఖాళీగా ఉన్నాయి.

సీఎంతో చర్చించి కమిటీలు వేస్తాం

: మంత్రి శివరాజ్ తంగడిగ

కన్నడ సంస్కృతి శాఖకు అనుబంధంగా ఉండే అకాడమిలకు, ప్రాధికారలకు కమిటీలు ఏర్పాటు జాప్యం జరిగిందని కన్నడ సంస్కృతిశాఖా మంత్రి శివరాజ్‌తంగడిగ అభిప్రాయపడ్డారు. త్వరలోనే సీఎంతో చర్చలు జరిపి కమిటీలను భర్తీ చేస్తామన్నారు.

లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగండి

» 8 మంది మంత్రులకు డీసీఎం షాక్

బెంగళూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్‌లో అంతర్గత విబేధాలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్‌లో డీకే శివకుమార్ ఒక్కరే డీసీఎంగా ఉన్నారు. ఆయన ప్రాబల్యాన్ని తగ్గించే దిశగా మరో ముగ్గురిని డీసీఎం చేయాలనే డిమాండ్ వారం రోజులుగా హల్‌చల్ చేస్తోంది. ఒకానొక దశలో మరింతమందికి డీసీఎంలు అంటే నేను తప్పుకుంటాననే అల్టిమేటం కూడా డీకే శివకుమార్ ఇచ్చారు. ఇలా సాగుతుండగానే 28 లోక్‌సభ నియోజకవర్గాలకు మంత్రులను ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఎక్కువమంది లోక్‌సభ సభ్యులు గెలవాలంటే ప్రాబల్యం కల్గిన పలువురు మంత్రులకు టికెట్లు ఇవ్వాలని కేపీసీసీ ప్రతిపాదించింది. ఇదే నివేదికను ఢిల్లీ పెద్దలకు పంపారు. కొందరు పోటీకి సై అనగా మరికొందరు విముఖత చూపారు. ఇలా సాగుతుండగానే సీఎం సిద్దరామయ్య చక్రం తిప్పి ఆరు నెలలక్రితం ఎన్నికల్లో గెలిచి ఇప్పుడిప్పుడే మంత్రులైనవారికి వెంటనే పోటీ చేయాలని సూచించడం సమంజసం కాదని అధిష్ఠానం ముందు మెలికపెట్టారు. ఢిల్లీ పెద్దలు అందుకు అంగీకరించారు. కేబినెట్ మంత్రులు ఎవరికీ లోక్‌సభ టికెట్‌లు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. దీంతో ఊపిరి పీల్చుకున్న మంత్రులు అదనపు డీసీఎం పదవుల అంశాన్ని తెరపైకి తెచ్చారు. ఇటు బెంగళూరు అటు ఢిల్లీ పెద్దల వద్ద ఈ అంశాన్ని ప్రస్తావించారు. లోక్‌సభ ఎన్నికల్లోగా ఎక్కువ మందికి డీసీఎం హోదాలు కల్పించడం ద్వారా సామాజిక పరంగా మద్దతు పెరగనుందనే అభిప్రాయపడ్డారు. ఇలా సాగుతుండగానే డీకే శివకుమార్ అందరికీ మాస్టర్ స్ట్రోక్ ఇచ్చేలా హెచ్చరించారు. డీసీఎం పదవి కోరుకునేవారు తొలుత లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి సత్తా చాటితే ఆ తర్వాత పదవులు వస్తాయని ఆదేశించారు.

సిద్దూ వర్గీయుల పేర్లు ప్రతిపాదన

డీకే శివకుమార్ అధిష్ఠానానికి సూచించిన జాబితాలో తుమకూరు నుంచి రాజణ్ణ లేదా పరమేశ్వర్, చామరాజనగర నుంచి మహదేవప్ప, బెళగావి నుంచి సతీశ్‌జార్కిహోళి, కోలారు నుంచి మునియప్ప, బెంగళూరు ఉత్తర కృష్ణ భైరేగౌడ, బెంగళూరు సెంట్రల్ నుంచి జమీర్ అహ్మద్‌ఖాన్, బీదర్ నుంచి ఈశ్వర్‌ఖండ్రె, బళ్ళారి నుంచి నాగేంద్రలు ఉన్నారు. వీరంతా సిద్దరామయ్యకు ఆప్తులైన వారు కావడమే ప్రత్యేకం. మొత్తమ్మీద ఎన్నికల నాటికి ఎన్ని మలుపులు తిరగనుందో వేచి చూడాలి.

సీఐటీయూ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

బంగారపేట, జనవరి 12: రాష్ట్రంలోనూ, దేశంలోనూ పేదరికం, నిరుద్యోగం, శ్రామిక వర్గాలపై నిర్లక్ష్యం చూపుతున్నారని, దేశ ఆర్థిక పరిస్థితి అవసాన దశకు చేరిందని ఈ నేపథ్యంలో ప్రభుత్వ తీరును ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సంతకాల సేకరణ చేపట్టనున్నట్టు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పీ శ్రీనివాస్ వెల్లడించారు. పట్టణంలోని నాడప్రభు కెంపేగౌడ సర్కిల్‌లో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ కోలారు జిల్లా సమితి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి నుంచి మహాత్మాగాంధీ వర్ధంతి వరకు ఆహార, ఆరోగ్య, విద్యకై దేశాన్ని అభివృద్ధి చేసి సమానవేతనం కల్పించడం ద్వారా శ్రామికుల జీవితాల్లో వెలుగు నింపాలని కోరుతూ ఈనెల 30వరకు సంతకాల సేకరణ చేపట్టదలిచామన్నారు. అన్ని కార్మిక చట్టాలను సరిదిద్దాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాల్సి ఉందని, నిరుద్యోగ సమస్యకు అడ్డుకట్ట వేయాలన్నారు. గ్రామపంచాయతీ ఉద్యోగులు, స్కీం ఉద్యోగులకు, అసంఘటిత కార్మికులకు కనిష్ఠవేతనం రూ.32 వేలు, పింఛను 6వేలు నిర్ణయించాల్సి ఉందన్నారు. భవన నిర్మాణ తదితర కార్మికులకు పీఎఫ్ సదుపాయం, వారి పిల్లలకు స్కాలర్‌షిప్ ఇవ్వాలని కోరారు. బెమెల్ వంటి సంస్థలను ప్రైవేటీకరణ చేయరాదన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా మాజీ నాయకుడు జీ అర్జునన్, హమాలి కార్మికసంఘం అధ్యక్షుడు కృష్ణన్, గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం కేజీఎఫ్ తాలూకా అధ్యక్షుడు రామకృష్ణప్ప, బంగారపేట తాలూకా ప్రముఖుడు ఎం మోహన్ తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం

స్వచ్ఛతకు సహకారం అవసరం



రాజకాలువ పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

శిడ్లఘట్ట, జనవరి 12: శిడ్లఘట్ట పట్టణంలో ఎన్నో ఏళ్లుగా స్వచ్ఛత సమస్య పరిష్కారానికి ఒక కార్యాచరణ సిద్ధమైందని ఇందుకు ప్రజలందరూ సహకరించాలని ఎమ్మెల్యే రవికుమార్ పేర్కొన్నారు. పట్టణంలో స్వచ్ఛత కాపాడడంలో అందరి సహకారం ఎంతో అవసరమన్నారు. ఇందుకు నగరసభ, ప్రజలు తమ వంతు బాధ్యత నిర్వహించాలన్నారు. బస్టాండ్ సమీపాన చిక్కబళ్ళాపుర రోడ్డు మార్గంలో చెరువును కలిపే రాజకాలువలో సొంత ఖర్చుతో పూడికతీత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గౌడన చెరువు నుంచి అమ్మన చెరువుకు వెళ్లే కాలువ ఎంతోకాలంగా పిచ్చిమొక్కలు, పూడికతో నిండి పోవడంతో వర్షపునీరు సజావుగా వెళ్లలేదన్నారు. దీంతో దోమలబెడద అధికమైందన్నారు. ఈ నేపథ్యంలో స్వచ్ఛతా పనులు చేపట్టేందుకు సిద్ధమైనట్టు తెలిపారు. ఇందుకు సుమారు 20రోజులపాటు సమయం పడుతుందన్నారు. రెండు పొక్లైనర్‌లు, మూడు ట్రాక్టర్‌లు పనిచేస్తాయన్నారు. కాలువ స్వచ్ఛంగా ఉంటే పట్టణం కూడా స్వచ్ఛతకు ఎంతో సహకారి కానుందన్నారు. అలాగే అన్ని వార్డులలోని మోరీలను స్వచ్ఛపరిచే పనులు దాదాపు పూర్తయ్యాయన్నారు. ఇష్టం వచ్చినట్టు చెత్త పడేయరాదని ప్రజలను కోరారు. ఇందుకు నగరసభ సిబ్బందికి సహకరించాలన్నారు. ఈ సందర్భంగా నగరసభ కమిషనర్ మంజునాథ్, నగరసభ మురళి, జడ్పీ మాజీ సభ్యుడు బంక్ మునియప్ప, ప్రముఖుడు తాదూరు రఘు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆదర్శాలను అలవరచుకోండి

బాగేపల్లి, జనవరి 12: మహనీయుల ఆదర్శాలను అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు బ్లాక్ కాంగ్రెస్ తాలూకా అధ్యక్షుడు హెచ్‌ఎస్ నరేంద్ర సూచించారు. తాలూకాలోని ఘంటంవారిపల్లిలోని ప్రభుత్వ హైస్కూల్‌లో స్వామి వివేకానంద జయంతితోపాటు మాజీ సీఎం వీరప్ప మొయిలీ పుట్టినరోజును పురస్కరించుకుని శుక్రవారం పలు కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్‌లు, ఆంగ్ల నిఘంటువులు పంపిణీ చేశారు. నరేంద్ర మాట్లాడుతూ ప్రపంచంలో పేరొందిన ప్రముఖుల సాధనలను ప్రస్తావిస్తూ సమాజం కోసం పాటుపడినవారిని ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారన్నారు. యువకులు విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకుని ఉత్తమ సమాజనిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. ఇదే సందర్భంగా సామాన్య కార్యకర్త నుంచి ముఖ్యమంత్రి దాకా ఎదిగిన వీరప్పమొయిలీ అనుభవాలను ప్రస్తావించారు. కార్యక్రమంలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు క్విజ్, చర్చాగోష్టులు, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమశేఖర్, సుబ్బురామ్, ఘంటంవారిపల్లి గ్రామపంచాయతీ అధ్యక్షుడు నవీన్‌కుమార్, సభ్యులు రమణమ్మ నాయక్, మంజునాథ్, ఎన్‌ఎస్‌యూఐ తాలూకా అధ్యక్షుడు అంబరీశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రామసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.



డిక్షనరీలతో విద్యార్థులు, నిర్వాహకులు

బెంగళూరులో మరోసారి గుర్రాలతో పోలీసు గస్తీ

బెంగళూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): నగర వ్యాప్తంగా రద్దీ ప్రాంతాలలో ద్విచక్రవాహనాలు, హొయ్సళ అత్యవసర వాహనాలతో పాటు గుర్రాలతోను పోలీసు గస్తీ చేపట్టనున్నారు. గతంలో బెంగళూరులో గుర్రాలతో పోలీసు గస్తీ కొనసాగేది. ఇటీవల కాలంలో నగర విస్తీర్ణం పెరగడం అందుకు అనుగుణంగా ప్రాంతాల వారీగా పోలీసుస్టేషన్‌లు ఏర్పాటు కావడంతో బందోబస్తు చర్యలు కొనసాగుతున్నాయి. కానీ వారాంతంతో పాటు ప్రత్యేక వేడుకలు వేలాది మంది ప్రజలు పాల్గొనే కార్యక్రమాల మధ్యలోకి వాహనాలతో పోలీసులు వెళ్ళే పరిస్థితి ఉండదు. అందుకే గుర్రాల ద్వారా గస్తీ కొనసాగించే ఆలోచన ఉందని నగర పోలీసు కమిషనర్ దయానంద్ తెలిపారు. ఇప్పటికే మైసూరు నగరంలో పోలీసుశాఖ ఒక కంపెనీ గుర్రాల ద్వారా గస్తీ చేపట్టనుంది. ఎస్పీ స్థాయి అధికారి వాటి పర్యవేక్షణా బాధ్యతలు తీసుకుంటారు. అదే తరహాలోనే బెంగళూరులోను గుర్రాలతో గస్తీ కొనసాగించదలచినట్లు తెలిపారు. ప్రత్యేకించి వారంతంలో కబ్బన్‌పార్క్, విధానసౌధ, మెజిస్టిక్, ఎంజీరోడ్, లాల్‌బాగ్ వంటి ప్రదేశాలలో గస్తీ కొనసాగిస్తామన్నారు. గతంలో బెంగళూరులో గుర్రాల ద్వారా పోలీసు బందోబస్తు చర్యలు కొనసాగేవని, ఇటీవల కొన్నేళ్ళ దాకా కబ్బన్‌పార్కులో పర్యవేక్షణ ఉండేదని పలు కారణాలతో రద్దు చేసిన గుర్రాల ద్వారా గస్తీని కొనసాగించదలచామన్నారు. రిపబ్లిక్ వేడుకల వేళ రాజభవన్ నుంచి మానెక్ షా పరేడ్ మైదానం దాకా గవర్నర్‌ను సాదరంగా స్వాగతించేందుకు, ఏడాదికోసారి గవర్నర్ విధానసౌధకు వచ్చే వేళ అశ్వదళాల పర్యవేక్షణ ఉంటుంది. గుర్రాలతోనే సాహసక్రీడలు చేసే పోలీసుల బలగాలు బెంగళూరు, మైసూరులలోను ఉన్నాయి.



నగరంలో గస్తీ తిరుగుతున్న అశ్వదళం

యువజన కాంగ్రెస్ జాతీయ మీడియా కో-ఆర్డినేటర్‌గా వీఎస్ అభిషేక్ నియామకం

బెంగళూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ జాతీయ మీడియా కో-ఆర్డినేటర్‌గా బెంగళూరు నగరానికి చెందిన యువ నేత వీఎస్ అభిషేక్ నియమితులయ్యారు. ఈ మేరకు యువజన కాంగ్రెస్ జాతీయ మీడియా ఇన్‌చార్జి నగరంలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్‌ల సూచన మేరకు ఈ కీలక పదవిని అప్పగించామని వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ విజయాలకోసం అవసరమైన వ్యూహాలను రూపొందించాలని ఆయన అభిషేక్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు.

లోక్‌నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాధాకృష్ణరాజుకు జీవన సాఫల్య పురస్కారం

బెంగళూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణానికి చెందిన లోక్‌నాయక్ ఫౌండేషన్ నగర ప్రవాసాంధ్ర ప్రముఖుడు డాక్టర్ ఏ రాధాకృష్ణరాజును జీవన సాఫల్య పురస్కారం కోసం ఎంపిక చేసింది. ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ కు ఇదే వేదికపై సాహిత్య పురస్కారం, డా. రాజుతో పాటు ప్రముఖ వైద్యనిపుణుడు డా.ఇండ్ల రామ సుబ్బారెడ్డిలకు జీవన సాఫల్య పురస్కారాలను మహానటుడు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సందర్భంగా ఈ నెల 20న అందజేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెగాస్టార్ చిరంజీవి హాజరవుతారని ఫౌండేషన్ నగరంలో విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కాగా తనను జీవన సాఫల్య పురస్కారం ప్రకటించిన లోక్‌నాయక్ ఫౌండేషన్‌కు డాక్టర్ రాజు కృతజ్ఞతలు తెలిపారు. నగరంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తమిళనాడు ప్రభుత్వం ఎట్టకేలకు తెలుగులో పాఠ్యపుస్తకాలను ముద్రించాలని ఆదేశిస్తూ జీవో జారీ చేయడాన్ని స్వాగతించారు. దశాబ్దకాలంగా తమిళనాడులోని తెలుగు, కన్నడ, మలయాళం, తదితర భాషల ప్రజలు తమ మాతృభాషలో చదువుకునేందుకు పరీక్షలు రాసేందుకు న్యాయపోరాటం చేస్తున్నారని ఆయన గుర్తుచేశారు. రాజ్యాంగ పరమైన హక్కులను గుర్తించి తమిళనాడు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం సంతోషంగా ఉందన్నారు.

రేపు నగరంలో ఆనంద్ మహోత్సవం

బెంగళూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): విశ్వ ధర్మ చేతన మంచ్ బెంగళూరు కేంద్రం ఆధ్వర్యంలో ఆనంద్ మహోత్సవ్ జరుగనుంది. బెంగళూరు ప్యాలెస్ మైదానంలోని రాయల్ సెనేట్‌లో ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని నిర్వాహకులు శుక్రవారం మీడియా సమావేశంలో తెలిపారు. 14న మధ్యాహ్నం 4 గంటలకు ఈ ఉత్సవాన్ని ఉప ముఖ్యమంత్రి డికె.శివకుమార్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఆరో నెంబరు గేట్ నుండి భక్తులు రావాలని పార్కింగ్‌కు కూడా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ ఉత్సవంలో తిరుపతికి చెందిన సద్గురు సిద్దేశ్వర్ బ్రహ్మర్షి గురుదేవ్ ఆధ్యాత్మిక ప్రసంగం ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రాంతాల నుండి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు కానున్నారని నిర్వాహకులు తెలిపారు.

రాఘవేంద్రస్వామి మఠంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న స్వామిజీ

బెంగళూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు జయనగర్‌లోని నంజనగూడు రాఘవేంద్రస్వామి మఠంలో గురువారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ మేరకు మఠం సీనియర్ మేనేజర్ ఆర్‌కే వాదీంద్రాచార్ నగరంలో శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఉదయం పంచామృతాభిషేకం, కనకాభిషేకం, ప్రత్యేక అలంకారం, మహామంగళ హారతి, అన్నదానం వంటి కార్యక్రమాలు జరిగాయని అనంతరం రథోత్సవం, గజవాహనోత్సవం, అష్టావధానం, ఊయల సేవలు జరిగాయని భక్తులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారని ప్రకటనలో పేర్కొన్నారు. ఇదే సందర్భంగా హృద్యా అకాడమీకి చెందిన రూపశ్రీ బృందంచే నృత్య సంగీత కార్యక్రమాలు జరిగాయని తెలిపారు.

20 నుంచి చిరుధాన్యాల పండుగ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 12: 'మన పంటలు-మన వంటలు' అనే నినాదంతో ఈనెల 20వతేదీ నుంచి అనంత చిరుధాన్యాల పండుగ ప్రదర్శన జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వైవీ మల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఏఎఫ్ ఎకాలజీసెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ స్వచ్ఛంద సంస్థలు, వ్యవసాయ పరిశోధన సంస్థలు, సామాజిక స్పృహ కలిగిన వ్యాపారుల సంయుక్త సహకారంతో ఈనెల 20, 21, 22వ తేదీల్లో మూడు రోజుల పాటు అనంత చిరుధాన్యాల పండగ-2024 నిర్వహిస్తామన్నారు. మొదటి రోజుప్రారంభోత్సవం, చిరుధాన్యాలతో ఆరోగ్యం, వాతావరణ మార్పులు అరికట్టే చిరుధాన్యాల సాగు అంశాలపై సదస్సు ఉంటుందన్నారు. రెండో రోజు చిరు ధాన్యాల సాగులో మెలకువలు, సహభాగ ధ్రువీకరణ పద్ధతి, స్వల్పకాలిక చిరుధాన్యాల రకాల సాగుపై వివరిస్తారన్నారు. చివరి రోజు చిరుధాన్యాల ప్రాసెసింగ్-విలువ ఆధారిత ఉత్పత్తులు అంశంపై శాస్త్రవేత్తలు ప్రసంగిస్తారని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మూడు రోజుల పాటు కళాకారుల బృందం పల్లెపాటలు, నాటికలు, తోలు బొమ్మలాటల ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రజల సంపూర్ణ ఆరోగ్యం, రైతుల సుభిక్షం కోసం ఆకాంక్షించే వారందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.